# గొప్ప ఆనందం

## (ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక - సంగ్రహ సమీక్ష)

### ఎ. ఉపోద్ఘాతం :

1. **గ్రంథకర్త :** అపొస్తలుడైన పౌలు రోమా పట్టణములో ఖైదీగా ఉన్నప్పుడు నాలుగు పత్రికలు వ్రాసాడు. అందులో ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక ఒకటి. ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక, ఎఫెసీయులకు, కొలస్సీయులకు మరియు ఫిలెమోనుకు వ్రాసిన పత్రికలు చెర పత్రికలు అని పిలువబడుతున్నవి.

2. **పాఠకులు :** ఐరోపా ఖండంలోని, ఫిలిప్పీ పట్టణంలో ఉన్న విశ్వాసులను ఉద్దేశించి ఈ పత్రిక వ్రాయబడింది. ఇతర సంఘాలన్నిటికన్న ఫిలిప్పీ సంఘం పౌలుకు చాలా సన్నిహితమైనది. ఈ సంఘస్తులకు పౌలుకు గల సంబంధాన్ని బట్టే ఈ పత్రిక ఆవిర్భవించింది.

3. **ఫిలిప్పీ సంఘం :** పౌలు రెండవ మిషనరీ పర్యటనలో ఈ సంఘము స్థాపించబడింది. లూదియ, ఆమె కుటుంబం (అపో.కా. 16:13-15), చెరసాల నాయకుడు మరియు అతని ఇంటివారు. (అపో.కా. 16:30-33) పౌలు పరిచర్య ఫలితంగా మార్చబడ్డారు. వారుగాక ఇతర సభ్యులు కూడా ఉన్నారు. వీరందరు పౌలుకు అతిసన్నిహితులు, ప్రియులు. పౌలు పర్యటనలలో వారు అతని అవసరాలన్నీ తీరుస్తూ, అతనికి పరిచర్య చేసారు.

4. **ఉద్దేశం :** పౌలు కొరింథీయుల ప్రవర్తనను సరిదిద్దడానికి, మరియు గలతీయులను తప్పు సిద్ధాంతమును గూర్చి ఖండించి, హెచ్చరించడానికి వ్రాసినట్లు ఈ పత్రిక వ్రాయబడలేదు. కేవలం ఫిలిప్పీ సంఘస్తులు పౌలు పట్ల చూపించిన ప్రేమకు కృతజ్ఞతగా వ్రాసాడు. పౌలు యెరూషలేములో బంధించబడిన పిదప దాదాపు 2 సంవత్సరాల వరకు అతని గూర్చి ఫిలిప్పీ సంఘస్తులకు ఏ సమాచారం తెలియలేదు. చివరికి పౌలు రోమా పట్టణంలో ఖైదులో ఉన్నాడని తెలిసి, వారి సంఘకాపరియైన ఎపఫ్రొదితును పౌలు వద్దకు పంపిచారు. పౌలు అవసరాల నిమిత్తం కానుక కూడ పంపించారు.

5. **ఫిలిప్పీ పత్రిక విశిష్ఠత :** విశ్వాసుల క్రైస్తవ అనుభవం ఏ స్థాయిలో ఉండాలో ఈ పత్రిక సూచిస్తున్నది. మనం వ్యక్తిగతంగా ఉన్న స్థాయిని గూర్చి ఈ పత్రిక చెప్పడం లేదు గాని, దేవుడు మనల్ని ఏ స్థితిలో ఉండాలని కోరుతున్నాడో తెలియజేయబడింది.

### బి. ఫిలిప్పీ పత్రిక విభజన :

#### I. మొదటి అధ్యాయం - క్రైస్తవ జీవిత తత్త్వశాస్త్రము (Philosphy of Christian Living)

1. ఉపోద్ఘాతం - 1:1,2 2. ఫిలిప్పీయుల పట్ల పౌలు దయార్ద్ర హృదయం - 1:3-11
3. సువార్త ప్రబలుటకు సంభంధించిన బంధకాలు మరియు కష్టాలు - 1:12-20.
4. బ్రదికినా చనిపోయినా క్రీస్తే - 1:21-30.

**II. రెండవ అధ్యాయం - క్రైస్తవ జీవితమునకు నమూనా (Pattern for Christian Living)**

1. ఇతరుల పట్ల ప్రవర్తించాల్సిన విధానం - 2:1-4.
2. క్రీస్తునకు కలిగిన మనస్సు (తగ్గింపు) - 2:5-8.
3. దేవుని మనస్సు (క్రీస్తును హెచ్చించుట) - 2:9-11.
4. పౌలు మనస్సు (క్రీస్తును గూర్చిన సంగతులలో సంతోషించుట) - 2:12-18.
5. తిమోతి మనస్సు (పౌలు వంటి మనస్సు) - 2:19-24.
6. ఎపఫ్రొదితు మనస్సు (క్రీస్తు యొక్క పనిచేయుట) - 2:25-30.

**III. మూడవ అధ్యాయం - క్రైస్తవ జీవిత బహూమానం (Prize for Christian Living)**

1. పౌలు తన గత యోగ్యతల జాబితాను మార్చుకొనుట - 3:1-9.
2. పౌలు తన ప్రస్తుత ఉద్దేశాన్ని మార్చుకొనుట - 3:10-19.
3. పౌలు తన భవిష్యత్తును గూర్చిన నిరీక్షణను మార్చుకొనుట - 3:20, 21.

**IV. నాల్గవ అధ్యాయం - క్రైస్తవ జీవితశక్తి (Power for Christian Living)**

1. ఆనందం - శక్తికి మూలం - 4:1-4. 2. ప్రార్థన - శక్తి యొక్క రహస్యం - 4:5-7.
3. క్రీస్తును గూర్చిన ధ్యానం - శక్తి యొక్క పవిత్ర స్థానం - 4:5-7.
4. క్రీస్తునందు ఉండుట - శక్తిలోని సంతుష్టి - 4:10-23.

## సి. అధ్యాయాల వారిగా సంగ్రహ సమీక్ష :

### 1. మొదటి అధ్యాయం :

**మూల వచనం : "నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే చావైతే లాభము"** (ఫిలిప్పీ 1:21). పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక ఆచరణాత్మకమైనది. ఎఫెసీ పత్రిక చదువుతున్నప్పుడు, పరలోకంలో కూర్చున్న అనుభూతి కలిగినట్లు ఈ పత్రిక చదివినప్పుడు కలుగదు. మనము ఈ భూమి మీద జీవించాల్సిన విధానాన్ని గూర్చి ఈ పత్రిక బోధిస్తుంది. ఈ పత్రిక ప్రారంభంలో పౌలు కేవలం తన పేరును మాత్రమే ప్రస్తావించి శుభములు తెలియజేయడం గమనార్హం. పౌలు ఈ సంఘములో తన అపొస్తలత్వాన్ని నిరూపించుకోవలసిన అవసరత లేదు. ఈ పత్రిక ఫిలిప్పీలో ఉన్న క్రీస్తు యేసు నందలి సకల పరిశుద్ధులను సంబోధించి వ్రాయబడింది. ప్రతి విశ్వాసి, క్రీస్తులో వారికి ఉన్న స్థానాన్ని బట్టి పరిశుద్ధులు అని పిలువబడుతున్నారు.

ఫిలిప్పీ సంఘంలో అధ్యక్షులు (బిషప్‌లు), పరిచారకులు (డికన్లు) ఉన్నారు. పౌలు వారికి కూడ శుభములు తెలియజేస్తున్నాడు. అధ్యక్షులు అనగా ఆత్మీయంగా పరిపక్వతనొందిన నాయకులు పరిచారకులు అనగా ఇతర విధులను నిర్వహించే ఆత్మీయ పరులైన విశ్వాసులు (అపో.కా. 6:1-5).

ఫిలిప్పీ సంఘస్తుల పట్ల పౌలుకు గల దయార్ధ్ర హృదయం ఫిలిప్పీ 1:3-11 లో వెల్లడౌతున్నది. ఈ భాగంలో పౌలుకు ఫిలిప్పీయులకు గల అవినాభావ సంబంధం, ఫిలిప్పీయులను గూర్చి పౌలు దేవునికి కృతజ్ఞత చెల్లించుట, మరియు వారిలో ప్రారంభించబడిన కార్యము యేసు క్రీస్తు దినము వరకు కొనసాగించబడాలని ప్రార్థించుట మొదలైనవి వ్రాయబడినవి. పౌలు హృదయంలో ఫిలిప్పీయులకు గల స్థానమును గూర్చి మరియు సువార్త ప్రకటనలో వారి పాలిభాగమును గూర్చి కూడ ఈ భాగంలో ప్రస్తావించబడింది. ఫిలిప్పీయులు పౌలుతో సువార్తపనిలో సహకరించినట్లు మరి ఏ సంఘస్తులు కూడ సహకరించలేదు.

**పౌలు ఫిలిప్పీయుల నిమిత్తం చేసిన ప్రార్థనలో మూడు ముఖ్యమైన అంశాలున్నాయి 1:19 వ వచనం**

1. విశ్వాసులు శ్రేష్ఠమైన కార్యాలను వివేచించగలవారైయుండాలి. అనేక విషయాలు మనముందుంచబడినపుడు అందులో ఏది దేవుని చిత్తమో తెలిసికొని తీర్మానం చేసుకొనే వివేచన కావాలి.
2. క్రీస్తునందు విశ్వాసముంచిన వారి ప్రేమ తెలివితోను, జ్ఞానముతోను నిండినదై అంతకంతకు అభివృద్ధిపొందాలి. అందరినీ ప్రేమించాలి, ఆ ప్రేమలో అభివృద్ధిచెందాలి. ప్రేమించుటలో కూడ వివేచన కలిగి ఉండాలి.
3. క్రీస్తు దినమునకు నిష్కపటులును నిర్దోషులును కావాలి. నిష్కపటము అనే మాటకు ఆంగ్ల భాషలో ఉపయోగించబడిన పదము sincere. ఇది లాటిన్ భాష నుండి తీసికొనబడింది. ఈ మాటకు మైనపు పూత లేనిది (without wax) అని అర్థం. రోమీయులు ఆరాధించే దేవతల గుళ్ళను అమ్మే వ్యాపారస్తులు వాటిలో ఏర్పడిన పగుళ్ళు కనిపించకుండ మైనం ఉపయోగించేవారు. పైకి ఆకర్షణీయంగా కనిపించే ఆ విగ్రహాలలోని మైనం ఎండవేడిమికి కరిగిపోయినపుడు దాని అసలు రూపం కనిపిస్తుంది. ఫిలిప్పీ సంఘ విశ్వాసులు అలా ఉండకూడదని పౌలు ప్రార్థిస్తున్నాడు. తరువాత భాగంలో (1:12-20) పౌలు, తన బంధకాలు మరియు కష్టాలు సువార్త వ్యాపించడానికే సంభవించాయని ఫిలిప్పీయులకు తెలుపుతు ప్రోత్సహిస్తున్నాడు (1:12).

**పౌలు బంధకాల వలన కలిగిన మేళ్ళు :**

1. ప్రేతోర్యమనే సేన (కైసరు న్యాయస్థానంలోనివారు అపొ.కా. 28:16) పౌలు కేవలం క్రీస్తు నిమిత్తమే బంధించబడ్డాడని నమ్మారు. పైగా అపొ.కా. 9:15 లోని మాటల నేరవేర్పుగా కైసరు ఇంటి వారందరికి మరియు తక్కిన వారికి సువార్త ప్రకటించబడింది (1:13).
2. సహోదరులైన వారిలో ఎక్కువ మంది, విశ్వాసమందు స్థిరపర్చబడి నిర్భయంగా దేవుని వాక్యాన్ని ప్రకటించుటకు ధైర్యము తెచ్చుకున్నారు (1:14).
3. మూడవ మేలును గూర్చి ఈ పత్రికలో వ్రాయబడలేదు గాని చరిత్రలో మనం చూస్తున్నాం. అదేమనగా పౌలు బంధకాలలో ఉన్నప్పుడు అతి శ్రేష్ఠమైన 4 పత్రికలు (ఎఫెసీ, ఫిలిప్పీ, కొలస్సీ మరియు ఫిలేమోను) వ్రాయబడినవి.

ప్రియ పాఠకులారా! విశ్వాసులైన మీ జీవితంలో ఏ పరిస్థితులైన మిమ్మల్ని బంధించాయా? అది ఏలాంటి నిర్బంధమైనా కావచ్చు, అనారోగ్యమే కావచ్చు, అకస్మాత్తుగా సంభవించిన ప్రమాదమే కావచ్చు మీరు నిరుత్సాహపడవద్దు. మీ పరిస్థితి దేవుని సువార్త మరి ఎక్కువ ప్రబలమవడానికి, ఇతరులకు మేలు కలగడానికి దోహదమౌతుంది. ఇక 1:15-17లో సువార్త ప్రకటిస్తున్న పలువురి ఉద్దేశాలను గూర్చి, మరియు వారిపట్ల పౌలు వైఖరిని గూర్చి వ్రాయబడింది. సువార్త ప్రకటించే వ్యక్తికాదు గాని, దేవుని వాక్యము మాత్రమే ఘనపర్చ బడుతుంది గనుక ఏ విధంగా, ఏ ఉద్దేశంతో ప్రకటించినా సువార్త ప్రకటించబడాలన్నదే పౌలు ఉద్దేశం.

ఈ అధ్యాయం చివరలో పౌలు తనకున్న ఒకే ఆశను వెల్లడిస్తున్నాడు. **"నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము"** (ఫిలిప్పీ 1:21) క్రైస్తవ జీవిత తత్వశాస్త్రమంతా ఈ మాటలోనే ఉన్నది. విశ్వాసి క్రీస్తు కొరకే జీవించాలి. అయితే క్రీస్తులో జీవించిన దానికన్న ఆయనయందు మరణించడంలో లాభం ఉంది. మరణానంతరం శాశ్వతంగా క్రీస్తుతో ఉండడమే ఆ లాభం. ఇది ఈ లోక తత్వ శాస్త్రజ్ఞులకు అర్థంగానిది.

పౌలుకు ఈ లోకం నుండి వెడలిపోయి క్రీస్తుతో కూడ పరలోకంలో ఉండాలన్న ఆశ ఉన్నది గాని అతని ముందు ఒక అవసరత కనిపిస్తున్నది (ఫిలిప్పీ 1:24). కనుక పౌలు ఈ రెండింటి మధ్య ఇరుకునబడ్డాడు. ఈ లోకంలో దేవుడు అప్పగించిన పనిని పూర్తి చేయడం ప్రతి విశ్వాసి కర్తవ్యం (యోహాను 17:4). పౌలు కూడ తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలనే కోరాడు (ఫిలిప్పీ 1:25, 26).

## II. రెండవ అధ్యాయం :

**మూల వచనం : "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి"** (ఫిలిప్పీ 2:5).

ఈ అధ్యాయంలో ఇతరుల పట్ల ప్రవర్తించాల్సిన విధానం, అందుకు క్రీస్తే క్రైస్తవ జీవితానికి మాదిరి అని పౌలు వ్రాసినపుడు, ఆయనను అనుకరించాలని చెప్పలేదు. కాని ఆయన మనస్సును అలవర్చుకోవాలని వ్రాసాడు. క్రైస్తవ జీవితం అనుకరణకాదు, అది ఒక అభ్యాసం. ఈ అభ్యాసములో ఇతరుల పట్ల ప్రవర్తించాల్సిన విధానాన్ని గూర్చి 2:1-4 లో వ్రాయబడింది. విభిన్న భావాలు, పద్ధతులు, సిద్ధాంతాలున్న వ్యక్తుల అభిప్రాయాలను అంగీకరించక పోవచ్చును గాని, వారిని అంగీకరించడమే ఏకత్వము. వ్యక్తిగత గుర్తింపు కొరకు చేసే పనులు మరియు సేవ వ్యర్ధం. ఏ సంఘంలో కక్ష, వృథాతిశం ఉండవో అక్కడ సమస్యలుండవు. స్వార్థం విడచి ఇతరులకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వడమే క్రీస్తునకు కలిగిన మనస్సు.

ఈ భాగంలో క్రీస్తు 7 విధాలుగా తగ్గించుకొనుట, (2:5-8) మరియు దేవుడు ఆయనను 7 విధాలుగా హెచ్చించుట చూస్తాము (2:9-11).

**క్రీస్తు తగ్గింపు :**

1. **పరలోకాన్ని విడచిపెట్టుట (2:6) :** యేసుక్రీస్తు దేవునిగా తన స్థానాన్ని సంతోషంగా విడచి పెట్టాడు.
2. **మనుష్యుల పోలికలో పుట్టాడు (2:7) :** ఆకారమందు మనుష్యునిగా కనిపించాడు (2:8). మానవుల బలహీనతలలో ప్రభువు సహానుభవం గలవాడు గనుక మనకు సహాయం చేయగల సమర్ధుడు (హెబ్రీ 4:15; 2:18).
3. **దాసుని స్వరూపమును ధరించుకొన్నాడు (2:7) :** ఈ మాట యేసు సామన్యస్థితిని సూచిస్తున్నది. యెషయా 11:10లో యెష్షయి మొద్దు చిగిరిస్తుంది అని ప్రవచించబడింది. బేత్లెహేము అనే కుగ్రామములో యెష్షయి ఒక సామాన్య రైతుగా జీవించినట్లు యేసు ఒక సామాన్యమైన వ్యక్తిగానే జీవించాలని కోరాడు.
4. **తన్ను తాను రిక్తునిగా చేసుకొన్నాడు (2:7) :** యేసుక్రీస్తు తన దైవత్వాన్ని వదలుకోలేదు. ఆయన అన్ని కాలల్లోను దేవుడే (యోహాను 1:1-3, 14) అయితే ఆయన దైవత్వంలోని ఆధిక్యతలను వదలుకొన్నాడు. లోకంలోని మానవ పరిమితులలో జీవించాడు. అవి తనకుతాను నియమించుకొన్న పరిమితులే. ఆయన భూమిపై జీవించినపుడు కూడా దేవుడే గాని పరలోకపు మహిమను విడచిపెట్టాడు. అందుకే ఆయన మరణానికి ముందు "నీ యొద్ద నాకు ఏ మహిమయుండెనో, ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమ పరచుము" (యోహాను 17:5) అని వేడుకొన్నాడు గాని, నా దైవత్వాన్ని తిరిగి ఇమ్మని ప్రార్థించలేదు.
5. **మరణం పొందునంతగా విధేయత చూపించాడు (2:8) :** మనిషి ఈ లోకంలో కొంతకాలం బ్రదకడానికే పుడతాడు. ఎప్పుడో ఒకప్పుడు చనిపోవాల్సిందే గాని అందుకు ఇష్టపడడు.

కాని క్రీస్తు చనిపోవడానికే పుట్టాడు. వాస్తవంగా పాపం చేసిన వారే మరణానికి పాత్రులుగాని ఆయన మనవులందరి రక్షణ కొరకు మరణించాల్సిన అవసరత వచ్చినప్పుడు సంపూర్ణ విధేయత చూపించాడు (యోహాను 10:15, 17, 18).

6. **సిలువ మరణం పొందునంతగా విధేయత చూపించాడు (1:8) :** సిలువ మరణం బహు కౄరమైనది, నిన్ను రక్షించడానికి ఆయన అత్యున్నత మహిమ నుండి, అతి నీచమైన, కౄరమైన మరణం పొందడానికి తన్ను తాను అప్పగించుకొన్నాడు. క్రీస్తునకు కలిగిన మనస్సు అంటే ఇదే.

7. **తన్ను తాను తగ్గించుకొన్నాడు (2:8) :** సాధారణంగా ఇతరులు మనల్ని తగ్గిస్తే తప్ప మనం స్వయంగా తగ్గించుకోము, అది చాల కష్టమైనది. కాని క్రీస్తు తన్ను తాను తగ్గించుకొన్నాడు.

**దేవుడు క్రీస్తును హెచ్చించుట :**

క్రీస్తు అందరికన్న, అన్నిటికన్న ఉన్నతమైన వానిగా హెచ్చించబడాలన్నదే దేవుని ఉద్దేశం. ఆయన యందు విశ్వాసముంచిన మనం కూడ ఎక్కడ ఉన్నా, ఏమి చేసినా ఆయనను హెచ్చించాలన్న లక్ష్యమే కలిగి ఉండాలి.

దేవుడు ఆయనను హెచ్చించిన విధానం.

1. పరలోకమందున్న వారిలోగాని (పరలోకవాసులు).
2. భూమి మీద ఉన్నవారిలో గాని (మానవులు).
3. భూమి క్రింద ఉన్నవారిలో గాని (పాతాళంలో ఉన్నవారు).
4. ప్రతి మోకాలు యేసు నామమున వంగునట్లు హెచ్చించాడు. (2:9,10), ఈ వాక్యభాగాన్ని ఆధారం చేసుకొని, మానవులందరు రక్షించబడతారని చెప్పలేము. పాతాళంలో ఉన్నవారికి రక్షణ పొందే అవకాశం లేదు. కాని వారు ప్రభువుగా ఆయన అధికారాన్ని (**Lordship**) ఒప్పుకొని ఆయన నామమున మోకాళ్ళువంచుతారు (ప్రకటన 5:13, 14).
5. ప్రతి నాలుక యేసు క్రీస్తును ప్రభువని ఒప్పుకొనునట్లు హెచ్చించాడు (2:11). ఈ లోకంలో జీవిస్తున్న వారిలో యేసు క్రీస్తును రక్షకునిగా ఒప్పుకొననివారున్నారు. అలాగే పాతాళంలో ఉన్నవారందరు ఆయనను ఒప్పుకోనివారే. అయితే వీరందరు కూడ ఆయనను ప్రభువు అని తప్పనిసరిగా ఒప్పుకొనే దినం రాబోతుంది.
6. దేవుడు ఆయనను అధికముగా హెచ్చించాడు (2:11). ఆయన చేసిన ప్రపంచమంతటి పైన మరియు దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన మానవుల నివాసస్థలమైన ఈ భూమి మీద ఆయన హెచ్చించబడి మహిమ పర్చబడాలన్నదే దేవుని ఉద్దేశం.
7. ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించాడు (2:11). యేసు నామంలోనే ఒక ప్రత్యేకత ఉంది (మత్తయి 1:21). ఆయన ఒక్కడే పాపం నుండి మానవులను రక్షించగలడు గనుక ఆ నామము ఆయన ఒక్కనికే తగినది. ఆ నామము మానవులందరి పేర్లకన్న, పరలోకంలోని దూతల పేర్లకన్న ఉన్నతంగా హెచ్చించబడింది.

ఇక 2:12-18లో క్రీస్తును గూర్చిన సంగతుల విషయం పౌలుకు గల మనస్సును గూర్చి ప్రస్తావించబడింది. పౌలు ఫిలిప్పీ సంఘస్తుల మధ్య లేడు గనుక వారి ఆత్మీయ జీవితాన్ని గూర్చి వారే బాధ్యత వహించి సొంత రక్షణను కాపాడుకోవాలని, రక్షణ పొందిన తరువాత

చేయాల్సిన క్రియలను గూర్చి (ఎఫెసీ 2:10) బాధ్యత వహించాలని, తద్వారా లోకమందు జ్యోతుల వలె ప్రకాశించాలని జ్ఞాపకం చేస్తున్నాడు (2:14-16). విశ్వాసి హృదయాన్ని దేవుడొక్కడే చూడగలడు. కాని లోకం మన క్రియలను చూస్తుంది. మన విశ్వాసాన్ని క్రియా రూపంలో వెల్లడించాలి. అందునిమిత్తం పౌలు పానార్పణంగా పోయబడినా సంతోషిస్తానన్నాడు (2:17). ఇందులో పౌలు మనస్సు కనిపిస్తున్నది. మానవుల రక్షణ కొరకు తాను బలిగా అర్పించబడాలన్నది క్రీస్తు మనస్సు. ఆ రక్షణను గూర్చిన సువార్త సేవలో తాను ప్రాణార్పణంగా పోయబడాలన్నది పౌలు మనస్సు.

2:19-24 లో పౌలు ఆత్మీయ కుమారుడైన తిమోతి మనస్సు కనిపిస్తున్నది. తండ్రిపట్ల కుమారుడు నమ్మకంగా ఉన్నట్లు, తిమోతి పౌలు పట్ల నమ్మకంగా ఉన్నాడు. అతడు పౌలు లాంటి మనస్సు కలిగి ఫిలిప్పీయులకు క్షేమము కొరకు పౌలు చింతించినట్లే అతడు కూడ చింతించాడు. విశ్వాసులుగా ఉన్న మీరు మీ సంఘాలలో తిమోతి వలె సహకరిస్తున్నారా?

ఈ అధ్యాయం చివరలో ఫిలిప్పీ సంఘానికి కాపరియైన ఎపఫ్రొదితు మనస్సు కనిపిస్తున్నది (2:25-30). ఇతడు కూడ క్రీస్తునకు కలిగిన మనస్సుగలవాడే. కనుకనే పౌలుకు ఉపచారం చేయడం కూడ క్రీస్తుపనే అని భావించాడు. అందుకోసం చావడానికైనా సిద్ధపడ్డాడు.

## III. మూడవ అధ్యాయం

**మూలవచనం "క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును, పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను"** (ఫిలిప్పీ 3:14).

ఈ అధ్యాయాన్ని "ప్రభువునందు ఆనందించుడి" అని ప్రారంభించి అదే సమయంలో, కుక్కల విషయం, అనగా అబద్ధ బోధకుల విషయం (యెష 56:10) దుష్టులైన పని వారి విషయం మరియు ఛేదన (సున్నతి) నాచరించే వారి విషయం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు.

ఈ భాగంలో పౌలు తన గత యోగ్యతలను గూర్చి, మార్చుకొనిన తన ప్రస్తుత ఉద్దేశాన్ని గూర్చి, మరియు తన భవిష్యత్ నిరీక్షణను గూర్చి వ్రాసాడు.

గతంలో పౌలు తనకున్న యోగ్యతలను ప్రేమించి, క్రీస్తును ద్వేషించాడు, (3:4-6) ఇప్పుడు తనకు లాభకరమైన వాటన్నిటిని క్రీస్తు కొరకు నష్టముగా పెంటగా ఎంచుకొన్నాడు (3:7-11). అదే నిజమైన మారుమనస్సు. దమస్కు మార్గంలో యేసును సంధించిన తరువాత పౌలు యోగ్యతల జాబితా మారిపోయింది. క్రీస్తు కొరకు పొందిన నష్టాల జాబితాను వ్రాస్తు, వాటి తరువాత లభించే లాభాల జాబితాను పేర్కొన్నాడు. పౌలు ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలకు స్వస్తి చెప్పి విశ్వాస క్రియల వైపు మొగ్గు చూపించాడు (3:10-19) రక్షించబడిన ప్రతివ్యక్తి విశ్వాసం ద్వారా నూతన ఉద్దేశాలను, నూతన లక్ష్యాలను కలిగి ఉంటాడు. అవి దేవుని కొరకు జీవించడానికి పురికొల్పుగా ఉంటాయి.

**పౌలు ప్రస్తుత లక్ష్యాలు :**

1. క్రీస్తును (ఆయన వ్యక్తిత్వాన్ని) గూర్చి ఇంకా ఎరగాలన్న ఆశ.
2. ఆయన పునరుత్థాన బలమును (ఆయన వాస్తవిక శక్తిని) ఎరగాలన్న ఆశ.
3. ఆయన శ్రమలలో పాలివాడగుట ఎట్టిదో ఎరగాలన్న ఆశ.
4. ఏ విధము చేతనైనను మృతులలో నుండి పునరుత్థానము కలుగవలెనన్న ఆశ.

క్రీస్తు తిరిగి వచ్చినపుడు ఎత్తబడే గుంపులో ఉండనేమో అన్న సందేహం పౌలుకు లేదు గాని, అందులో పాల్గొనేందుకు తగిన సంపూర్ణతలోనికి ఎదగాలన్న ఆశ కనిపిస్తున్నది (ఫిలిప్పీ 3:12). గతంలో చేసిన పొరపాట్లు తన భవిష్యత్తుకు ఆటంకంగా ఉండకూడదని వాటిని మరచి, ముందున్న వాటికై వేగిర పడ్డాడు. అందుకు లభించే బహుమానం కొరకు నిరీక్షిస్తూ, ముందుకు సాగుతున్నాడు. సంపూర్ణులైన వారందరు, అనగా ఆత్మీయ పరిపక్వతగల వారందరు అదే తాత్పర్యాన్ని కలిగి ఉండాలి.

## IV. నాల్గవ అధ్యాయం:

**మూలవచనం - "ప్రభువునందు ఆనందించుడి"** (ఫిలిప్పీ 4:4).

నాల్గవ అధ్యాయంలో క్రైస్తవ జీవిత శక్తిని గూర్చి వ్రాయబడింది. క్రైస్తవ జీవితాన్ని కొనసాగించడానికి శక్తి అనుగ్రహింపబడకుంటే మొదటి మూడు అధ్యాయాలలో చెప్పబడినవన్ని అర్థరహితంగా ఉంటాయి. ఆ శక్తికి మూలమైన ఆనందం గూర్చి (4:1-4), శక్తి యొక్క రహస్యమైన ప్రార్థనను గూర్చి (4:5-7) శక్తిని పొందగల స్థానము, అనగా క్రీస్తుపై ధ్యానాన్ని కేంద్రీకరించుటను గూర్చి (4:8,9) శక్తిలోని సంతుష్ఠిని పొందడానికి క్రీస్తునందు జీవించుటను గూర్చి (4:10-28) ఈ అధ్యాయంలో వ్రాయబడింది.

ఈ అధ్యాయం ప్రారంభంలో ఫిలిప్పీ సంఘంలోని ఇద్దరు స్త్రీల మధ్య తలఎత్తిన సమస్యను గూర్చి ప్రస్తావిస్తూ, వారిద్దరు ఏకమనస్సు గలిగి ఉండాలని విన్నవించుకొన్నాడు. యువొదియ మరియు సుంటుకే ఇద్దరూ సంఘంలో ప్రముఖ స్థానంలో ఉన్నారు. పౌలుతో పాటు సేవలో ప్రయాసపడ్డారు. ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నా క్రీస్తునకు కలిగిన మనస్సు కలిగివుంటే అది వారిని వేరు చేయలేదు అని పౌలు హెచ్చరించాడు. 4:4లో వ్రాయబడిన **"ప్రభువు నందు ఆనందించుడి"** అనే మాటలు ఈ పత్రిక అంతటికి మూలవాక్యం. సంతోషం కొరకు లోకంలో ఎంతో మంది, ఎంతో డబ్బు ఖర్చు చేస్తున్నారు. కాని నిజమైన ఆనందం ప్రభువులోనే ఉన్నది. అదే క్రైస్తవ జీవితానికి శక్తినిస్తుంది. అంతమాత్రమే కాదు, విశ్వాసులు దేనిని గూర్చియే గాని చింతించవద్దు. ప్రతి విషయము కొరకు ప్రార్థించాలి. (4:5-7) వారిలోని సహనాన్ని అందరు తెలిసికోవాలి గనుక వారు క్రీస్తు వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలి. మన జీవితంలో జరిగేవన్నీ వాస్తవాలే. అయితే వాటిని గూర్చి చింతిస్తే ప్రయోజనం లేదు గనుక వాటిని గూర్చి దేవునితో మాట్లాడాలి. మన ప్రార్థన విశ్వాసమనే పునాదిపై ఆధారపడి ఉండాలి. అనగా మన ప్రార్థనకు జవాబు లభించినదన్న విశ్వాసంతో ఆయనకు కృతజ్ఞత చెల్లించాలి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానం మన హృదయాలకు తలంపులకు కావలి ఉంటుంది (4:7). ఇక్కడ పేర్కొనబడిన సమాధానం నిరంతరం ఉండే సమాధానము కాదు గాని ఆయా పరిస్థితులలో మన హృదయంలోనికి ఒక్కసారిగా ప్రవహించే సమాధానము. ప్రార్థించిన వెంటనే పరిస్థితులు మారకపోవచ్చును. అయినా ప్రార్థించినపుడు వ్యక్తిగతంగా హృదయంలో కలిగే నెమ్మది లేక నిబ్బరమైన స్థితే **"సమస్త జ్ఞానమునకు మించిన సమాధానము"** ప్రార్థన మన పరిస్థితులను మార్చక ముందు మనల్నే మారుస్తుంది.

4:8,9 వచనాలు క్రైస్తవ శక్తి స్థానమైన క్రీస్తునే చూపిస్తున్నాయి. ఆయనే అన్నిటికన్న, అందరికన్న శ్రేష్ఠమైనవాడు గనుక ఆయనపైననే మన ధ్యానముంచాలి. విశ్వాసి అపవిత్రమైన వాటి కొరకు సమయాన్ని వృధాచేస్తే అతని జీవితంలో శక్తి లోపిస్తుంది. గనుక మన మనస్సులను ఎల్లప్పుడు కేంద్రీకరించడానికి ఒక పవిత్ర స్థానం మనకు అవసరం. ఆ పవిత్ర స్థానం క్రీస్తే.

పౌలు ఫిలిప్పీయుల నుండి ఏలాంటి సహాయాన్ని అర్థించలేదు. తనకు కలిగి ఉన్నవాటితో సంతృప్తి కలిగి జీవించడం నేర్చుకొన్నాడు (ఫిలిప్పీ 4:11). అంత మాత్రమే కాదు, పౌలు **"నన్ను బలపరచువానిని (క్రీస్తును) బట్టి సమస్తమును చేయగలను"** (ఫిలిప్పీ 4:13) అని చెప్పగలిగాడు. సమస్తము అంటే క్రీస్తుకు మన జీవితం పట్లగల ఉద్దేశాన్ని అనుసరించి దేనినైనా చెయ్యగలమన్నదే పౌలు మాటల అర్థం. మనం ఏమి చెయ్యాలని దేవుడు కోరుతున్నాడో దానిని చేయగల శక్తినిస్తాడు. ఒక రైలు పట్టాల మీద ఉన్నంత వరకు ముందుకు వెళ్ళినట్లుగా మన జీవితం క్రీస్తు చిత్తంలో ఉన్నంత వరకు శక్తివంతంగా ఉంటుంది (యోహాను 15:7). ఆయన చిత్తంలో లేని విశ్వాస జీవితం పట్టాలు తప్పిన రైలులా అవుతుంది.

ఇక ఈ అధ్యాయం ముగింపులో పౌలు ఫిలిప్పీయులకు తన కృతజ్ఞతలు తెలుపుతూ, తాను ఎపఫ్రొదితు వలన పొందిన వస్తువులు మనోహరమైన సువాసనగా, దేవునికి ప్రీతికరమైన, ఇష్టమైన యాగముగా ఉన్నవని వర్ణించాడు (4:18). ఫిలిప్పీయుల సమర్పణను బట్టి తన అవసరాలు తీర్చబడినవి గనుక దేవుడు వారి ప్రతి అవసరాన్ని తీరుస్తాడని పౌలు హామి ఇచ్చాడు. (ఫిలిప్పీ 4:19). తరువాత పౌలు తనతో ఉన్నవారి పక్షంగా అందరికి వందనాలు తెలుపుతు ఆశీర్వచనంతో ముగించాడు.

# గొప్ప క్రైస్తవ జీవితం

## కొలస్సీయులకు వ్రాసిన పత్రిక - సంగ్రహ సమీక్ష

### ఎ. ఉపోద్ఘాతము

1. **గ్రంథకర్త :** అపొస్తలుడైన పౌలు (కొలస్సీ 1:1).
2. **కాలము :** పౌలు రోమా చెరలో ఉన్నప్పుడు, అనగా క్రీ॥శ॥ 62 సం॥లో వ్రాయబడింది.
3. **కొలస్సీ సంఘం :** కొలస్సీ పట్టణం, ఎఫెసీ పట్టణమునకు తూర్పు దిశన, సుమారు 75 నుండి 100 మైళ్ళ దూరంలో, లవొదికయ మరియు హియెరాపొలి పట్టణాలకు సమీపంలో ఉన్నది. తూర్పు మరియు పశ్చిమ దేశాలు కలిసేచోట ఉన్నందువల్ల దీన్ని **"ఫ్రుగియ ద్వారాలు"** అని పిలిచేవారు. తూర్పు దేశాల దాడులను అడ్డగించేందుకై ఈ పట్టణంలో కోటలు నిర్మించబడినవి.

   చరిత్ర ప్రకారంగా చూస్తే, పౌలు ఫ్రుగియ ద్వారం గుండా ప్రయాణించలేదు గాని కొలస్సీ పట్టణానికి ఉత్తర భాగాననున్న సార్దీస్ మీదుగా ఎఫెసీ పట్టణానికి వెళ్ళాడు. పౌలు కొలస్సీ పట్టణాన్ని దర్శించకున్నా అక్కడ అతడు సంఘాన్ని స్థాపించాడు. ఎఫెసీ పట్టణం కొలస్సీ పట్టణానికి సమీపంగా ఉన్నది గనుక బహుషా అక్కడి విశ్వాసులలో కొందరు ఈ ప్రాంతానికి రావడం వలన ఒక సంఘముగా ఏర్పడి ఉండవచ్చును. ఎపఫ్రా ఆ సంఘానికి నాయకుడు. ఫిలెమోను అనే విశ్వాసి గృహంలో సంఘముగా కూడుకొనేవారు.
4. **కొలస్సీ పత్రిక విశిష్టత :** ఎఫెస్సీ పత్రిక, ఫిలిప్పీ పత్రిక మరియు కొలస్సీ పత్రిక సంఘ నిర్మాణమును గూర్చి, అనగా క్రైస్తవ జీవిత విధానాన్ని గూర్చి వివరిస్తాయి. ఎఫెసీ పత్రికలో శరీరమనబడే విశ్వాసులను గూర్చి, కొలస్సీ పత్రికలో ఆ శరీరము యొక్క శిరస్సు ఆయిన క్రీస్తును గూర్చి వ్రాయబడింది. ఈ పత్రిక సారాంశమంతా క్రీస్తే. ఆయనే దైవత్వం యొక్క సర్వసంపూర్ణత.

**5. పత్రిక వ్రాయబడిన ఉద్దేశము :** మొదటి శతాబ్దంలో, చిన్న ఆసియా, మతేతర వాదం (heathenism) అన్యమతాలు (paganism) మరియు మార్మిక మతాలకు (mystery religions) కేంద్రముగా ఉండినది. వీటికి ముందే గ్నొస్తికవాదము (జ్ఞానవాదము) ఉన్నది. కొలస్సీ పట్టణంలో ఎస్సేనీయుల ప్రభావం ఎక్కువగా ఉండినది.

**ఎస్సేనీయుల లక్షణాలు :**

ఎ) వీరు అందరికన్న జ్ఞానంగలవారని ప్రత్యేకమైనవారని భావించేవారు. చివరికి అపొస్తలులకన్నా వారే జ్ఞానవంతులనే స్థితికి వచ్చారు. కనుక పౌలు వారిని హెచ్చరిస్తూ **"సమస్త విధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికి బుద్ధి చెప్పుచు, ప్రతి మనుష్యునికి బోధించుచు, ఆయనను ప్రకటించుచున్నాము"** (కొలస్సీ 1:28) అని వ్రాసాడు.

బి) వీరు దేవుడు ఒక సృష్టమును చేసాడని ఆ సృష్టము, ఈ ప్రపంచాన్ని సృష్టించాడని నమ్ముతారు. అనగా వీరు క్రీస్తును, దేవుడు చేసిన ఒక సృష్టముగా భావించారు. పౌలు ఈ విషయాన్ని ఖండిస్తూ, **ఆయనే సమస్తమునకు ఆధారభూతుడని స్పష్టం చేసాడు (కొలస్సీ 1:15-19; 2:18).**

సి) వీరు నైతికంగా, గ్రీకుల స్తోయికత్వం నుండి వైరాగ్యమును (Ascetism) మరియు గ్రీకుల ఎపిక్యూరనిజమ్ నుండి, నిర్భంధంలేని లైంగిక జీవిత విధానాన్ని అలవర్చుకొన్నారు. పౌలు ఈ రెండింటిని ఖండించాడు (కొలస్సీ 2:16, 23; 3:5-9).

**6. కొలస్సీ పత్రికలోని సందేశం :** ప్రారంభం నుండి క్రైస్తవ సంఘం రెండు ప్రమాదాలను ఎదుర్కొంటూనేవుంది.

ఎ) ఆచార కర్మకాండలకు ప్రాధాన్యతనిచ్చి చల్లారినస్థితికి అనగా ఆత్మీయంగా ఘనీభవించే స్థితికి రావడం;

బి) అధునాతన వాదం మరియు తత్త్వశాస్త్రం వైపు మొగ్గుచూపుతు ఆత్మీయత ఆవిరయ్యే స్థితికి రావడం;

క్రైస్తవ జీవితం ఈ రెండు స్థితులకు వేరుగా, సాధారణ ఉష్ణోగ్రతలో ద్రవించే నీరులా ఉండాలి. యేసుక్రీస్తు "నేను జీవజలమును" అన్నాడు. విశ్వసించిన వారిలో నుండి ఈ జీవజలాలు ప్రవహిస్తూ వుండాలి. కనుక పౌలు ఈ రెండు ప్రమాదాల నుండి విశ్వాసులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. క్రైస్తవ్యం అంటే క్రీస్తే. ఈ పత్రికలో "క్రీస్తే సమస్తం" అన్న అంశం ఎక్కువగా కనిపిస్తుంది (కొలస్సీ 2:9).

## బి. గ్రంథ విభజన - సమీక్ష

### I. సిద్ధాంత పరమైన భాగం - 1-2 అధ్యాయాలు

**1. ఉపోద్ఘాతం :** (1:1-8) పౌలు కొలస్సీలోని విశ్వాసులకు శుభములు తెలుపుతూ వారిలో ఉన్న మూడు మంచి లక్షణాలను (కృపలను) గూర్చి అభినందిస్తున్నాడు.

- క్రీస్తు యేసు నందు మీకు కలిగియున్న విశ్వాసము-ఇది వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించినది.
- పరిశుద్ధులందరి మీద మీకున్న ప్రేమ - ఇది వారి ప్రస్తుత సంఘ జీవితానికి సంబంధించినది.
- పరలోకమందు మీ కొరకు ఉంచబడిన నిరీక్షణ - ఇది భవిష్యతుకు సంబంధించినది. (I కొరి 13:13).

2. **పౌలు ప్రార్థన :** ఈ ప్రార్థనలో పౌలు విశ్వాసులలో జరిగిపోయిన వాటిని పేర్కొంటు, (1:13, 14) వాటిని బట్టి తండ్రికి కృతజ్ఞతాస్తులు చెల్లించాలని జ్ఞాపకం చేస్తున్నాడు. ఇక్కడ పౌలు పేర్కొన్న ప్రార్థనాంశాలు ప్రత్యేకమైనవి. ఈ సంఘస్తులు, తామే జ్ఞానులమనుకొంటున్న గ్నోస్తికుల వాదాన్ని ఎదిరించగల జ్ఞానాన్ని పొందాలని, అన్ని విషయాలలో ప్రభువు సంతోషపెట్టాలని, ప్రతి సత్కార్యంలో సఫలులవ్వాలని, దేవుని విషయమైన జ్ఞానంలో అభివృద్ధి చెందాలని, ఆయన మహిమ శక్తిని బట్టి సంపూర్ణ బలముతో బలపర్చబడాలని ప్రార్థించాడు.

3. **క్రీస్తు వ్యక్తిత్వం (1:15-19) :** ఈ భాగంలో పౌలు, ఇతర మానవులకు క్రీస్తుకు గల వ్యత్యాసాలను చూపిస్తూ, ఆయన అందరికన్నా ఉన్నతమైనవాడని నిరూపించాడు. మరియు ఆయన గుర్తింపును గూర్చిన చిహ్నాలను కూడ పేర్కొన్నాడు. క్రీస్తు దైవత్వాన్ని అనుమానిస్తున్న వారికి ఈ భాగం జవాబునిస్తుంది.

ఎ) క్రీస్తు అదృశ్య దేవుని స్వరూపి (15వ). అదృశ్యునికి రూపం ఉంటుందా? దీనిని యోహాను తన సువార్తలో 1:1; 1:14లోను స్పష్టం చేసాడు. యేసుక్రీస్తు అదృశ్య దేవుని రూపమేగాని శరీరధారిగా వచ్చాడు.

బి) సర్వ సృష్టికి ఆది సంభూతుడు (15వ). ఈ మాట, తండ్రితో ఆయనకు గల సంబంధాన్ని మరియు త్రిత్వంలో ఆయన స్థానాన్ని తెలుపుతున్నది. ఆయన సృష్టిలో ఉద్భవించలేదు. ఆది నుండి ఉన్నవాడు (యోహాను 1:2,3; మీకా 5:2).

సి) సర్వము ఆయన యందు, ఆయన ద్వారా సృజింపబడెను (16వ) దీనిని బట్టి ఆయన సృష్టమో, సృష్టికర్తనో స్పష్టమౌతున్నది. ఆకాశమందున్నవే గాని, భూమి మీద ఉన్నవేగాని దృశ్యమైనవి మరియు అదృశ్యమైనవి అన్నీ ఆయన ద్వారానే సృజింపబడ్డాయి.

డి) ఆయన అన్నిటికంటె ముందు ఉన్నవాడు (17వ) అనగా సృష్టికి ముందే ఉన్నవాడు.

ఇ) ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. (17వ) సమస్తము ఆయన స్వాధీనంలో ఉన్నవి. ఆయనే వాటిని నడిపిస్తాడు. కారణం మనిషి వాటిని సరిగ్గా నిర్వర్తించలేడు. మనిషి, దేవుడు చేసిన ఒక్క అణువును విభజించి శక్తివంతమైన అణుబాంబును తయారు చేసాడు. దాని వల్ల కలిగే నష్టం అంచనా వేయలేము. ఇక ప్రపంచాన్నంతా తన స్వాధీనంలో ఉంచుకోగలిగితే ఏమౌతుందో ఊహించండి. అందుకే ఆ బాధ్యతను ఆయన వహించాడు (హెబ్రీ 1:3).

ఎఫ్) ఆయన సంఘమునకు శిరస్సు (18వ). ఈ లోకంలో సంఘము క్రీస్తుకు శరీరంగా వుంది. ఆ శరీరమునకు శిరస్సుగా ఉన్న క్రీస్తును గూర్చి కొలస్సీ పత్రిక ప్రాధాన్యతనిస్తున్నది.

జి) ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యత ఇవ్వబడింది (18వ). క్రీస్తు దేవుని సృష్టి అంతటిపైగా ఉండాలన్నదే దేవుని లక్ష్యము.

**కొలస్సీ పత్రిక 1:15-20 విభజన :** తండ్రితో క్రీస్తు సంబంధం-(15వ), సృష్టితో క్రీస్తు సంబంధం-(16, 17వ), సంఘంతో క్రీస్తు సంబంధం-(18, 19వ), సిలువతో క్రీస్తు సంబంధం-(20వ).

4. **పాపుల కొరకు క్రీస్తు చేసిన పని 1:20-23 :**

ఆయన సిలువలో కార్చిన రక్తము ద్వారా మానవుల పాపములకు ప్రాయశ్చిత్తం చేసి, పాప పరిహారాన్ని చెల్లించి దేవునితో సంధి చేసాడు. మానవుడు దేవున్ని తృప్తి పర్చడానికి ఏమేమో చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు గాని దేవుడే మానవున్ని సంపాదించుకోడానికి సమస్తం

చేసాడు. యేసు సిలువ కార్యంలో పాపవిమోచన అన్నది మానవుడు దేవుని వైపు తిరుగడానికి జరిగించబడిన క్రియ. సమాధానపరచుట అన్నది దేవునితో సంబంధం కలిగి యుండుటకు జరిగించబడిన కార్యం. ఆయన అన్నిటిని సమాధాన పరచుకొన్నాడు. అంటే అందరు రక్షించబడతారని కాదు గాని సమాధాన పర్చడానికి చేయవలసినదంతా చేసాడని అర్థం (హెబ్రీ 9:23,24). తన సన్నిధిని పరిశుద్ధులుగాను, నిరపరాధులుగాను నిలువబెట్టుటకు (22వ) ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణం పొందాడు. ఆయన శరీరధారిగా నిజముగా శరీరమందు బాధను అనుభ వించాడు. జ్ఞానవాదాన్ని (గ్నోస్తికత్వం) ఖండించడానికి పౌలు ఈ మాటను స్పష్టంగా పేర్కొన్నాడు.

**5. పరిశుద్ధుల కొరకు క్రీస్తు చేసిన పని ( కొలస్సీ 1:24-29) :**

ఈ భాగంలో పౌలు తాను ఎందునిమిత్తం దేవుని వలన ఏర్పరచబడ్డాడో వివరిస్తు, విశ్వాసులకు దేవుడు బయలుపర్చాలని కోరిన అంశాలను గూర్చి వ్రాసాడు. యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి రక్షణ పొందడంతో తృప్తిచెందవద్దు గాని ఆయనను సంపూర్ణంగా ఎరగాలని దేవుని ఉద్దేశం. అందుకు ఆయన దేవుని వాక్యము, అనగా పాత నిబంధనలో మరుగుచేయబడియున్న మర్మము సంపూర్ణంగా ప్రకటించబడాలని (25, 26వ). క్రీస్తు మహిమ నిరీక్షణయైయున్నాడను సంగతిని పరిశుద్ధులకు తెలియపర్చాలని (27వ). ప్రతి విశ్వాసి క్రీస్తునందు సంపూర్ణుడుగా చేయబడాలని (28వ) కోరాడు. ఈ పరిచర్య నిమిత్తం పౌలు శ్రమపడ్డాడు. **"సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తుపడిన పాట్లల్లో కొదువైన వాటి యందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను"** (కొలస్సీ 1:24).

క్రీస్తు పాప పరిహారమంతా చెల్లించడానికై పొందాల్సిన శ్రమలన్నీ పొందాడు. యేసు సంఘరక్షణ కొరకు శ్రమపడ్డాడు, పౌలు రక్షించబడిన వారి కొరకు అనగా సంఘ క్షేమాభివృద్ధి కొరకు శ్రమపడ్డాడు. పౌలు రక్షించబడినపుడు అననీయ ద్వారా చెప్పబడిన మాటలన్ని (అపో.కా. 9:15,16) నెరవేర్చబడ్డాయి. ఇక కొదువగా ఉన్నది చెరలోని శ్రమలే. దానినే పౌలు వివరిస్తున్నాడు.

**6. తత్వశాస్త్రమునకు క్రీస్తే జవాబు (2:1-15) :**

ఈ భాగంలో కొలస్సీ మరియు లవొదికయ సంఘాలలో ఉన్న విభేధాలను గూర్చి పౌలుకున్న వేదన వ్యక్తం చేయబడింది. వారి దృష్టి "క్రీస్తు యొక్క వ్యక్తిత్వం"పై నుండి మరల్చబడింది. వారి కొరకు పౌలు వేదనతో ప్రార్థించాడు. (2:1,2) ఈ భాగమును మాక్ ఫెయిల్ అనే గ్రంథకర్త "వేదనతో కూడిన ప్రార్థన"గా వర్ణించాడు. ఈ సంఘంలో హానికలిగించే నాలుగు విషయాలను గూర్చి ఈ అధ్యాయంలో పౌలు హెచ్చరిస్తున్నాడు.

ఎ) **మోసకరమైన మాటలు (2:4-7) :** బైబిలును గూర్చిన స్వల్ప జ్ఞానమున్నవారే ఈలాంటి మాటలు మాట్లాడతారు. వీరు దేవుని వాక్యానికి బదులుగా, తత్వశాస్త్రమును, మానసిక శాస్త్రములను ప్రత్యామ్నాయాలుగా ఉపయోగిస్తారు. నేటి సంఘాలలోను ఈ ప్రమాదం చోటు చేసుకొంటున్నది. కొలస్సీ సంఘం మరణావస్థకు, లవొదికయ సంఘం నులివెచ్చని స్థితికి రావడానికి కారణం ఈ మాటలే.

బి) **తత్వజ్ఞానం (2:8-13) :** తత్త్వశాస్త్రం జీవిత సమస్యలకు పరిష్కారం చూపించదు. నిజమైన తత్వజ్ఞాని సత్యాన్ని అన్వేషిస్తాడు. అది మానవ జ్ఞానానికి అందనిది. ఆ జ్ఞానము క్రీస్తే (**I** కొరింథీ, 1:30) గనుక పౌలు క్రీస్తు తత్వశాస్త్రానికి (జ్ఞానమునకు) జవాబు అని స్పష్టం చేసాడు.

మనిషి యోగ్యంగా జీవించడానికి కోరికలను చంపుకోవాలని స్తోయికులు, భవిష్యత్తులో పొందబోయే స్థితి ఏమో తెలియదు గనుక దాని కొరకు ప్రస్తుత సుఖాన్ని త్యజించడం వ్యర్ధమని ఎపిక్యూరియనులు బోధించారు. ఈ రెండు కూడ మనిషి యొక్క పాతస్వభావముపై ప్రభావం చూపించేవే. అయితే వాటిని ఎలా అదుపులో ఉంచుకోవాలో పౌలు వివరించాడు. (2:10-12).

సి) **విధిపూర్వకరమైన ఆజ్ఞలు (2:14-17) :** వ్రాత పూర్వకంగా ఇవ్వబడిన ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలను ఏ మానవుడు కూడ తన స్వంత శక్తితో పాటించలేడు. అందును బట్టి క్రీస్తు మన కొరకు చనిపోయి వాటిని తన రక్తంతో తుడిచివేసాడు.

పాత స్వభావాన్ని క్రమశిక్షణలో ఉంచడానికి ధర్మశాస్త్రం ఇవ్వబడింది. ఇప్పుడు క్రీస్తులో, విశ్వాసికి క్రొత్త స్వభావం ఇవ్వబడింది. గనుక ధర్మశాస్త్రం రద్దు చేయబడింది. పాత నిబంధన ఆచార కర్మకాండలన్ని క్రీస్తుకు ఛాయగా మాత్రమే ఉన్నాయి (2:16). ఆయన ప్రత్యక్షపర్చబడ్డాడు గనుక ఇక వాటితో మనకు పని లేదు.

డి) **మార్మిక మతములు (2:18, 23) :** ఈ భాగంలో పౌలు గ్నోస్తికవాదము (జ్ఞానవాదము)ను గూర్చి మరియు ఎస్సెనీయుల వాదము (వైరాగ్యము)ను గూర్చి హెచ్చరించాడు. జ్ఞానవాదులు తామే అందరికన్న జ్ఞానవంతులను కొన్నప్పటికి వారికి క్రీస్తును గూర్చిన జ్ఞానం లేదు. నేటి సంఘాలలోను ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయిలో ఉన్నామనుకొన్న వారికి వాస్తవంగా దేవుని వాక్యము తెలియదు గాని వారు చూడని వాటిని గూర్చి గొప్పగా చెప్పుకొంటూ వారిలో లేని దానిని ఉన్నట్లుగా ప్రదర్శించడానికి నటిస్తారు. వీరు క్రీస్తుతో సంబంధం లేని వారు. శిరస్సును హత్తుకొననివారు (2:18,19).

ఎస్సెనీయులు బాహ్య శిక్షణను గూర్చి ప్రాధాన్యతనిస్తారు (2:20-23). ఇవి లోకము యొక్క మూలపాఠాలు, మనుష్యుల ఆజ్ఞలు మరియు పద్ధతులు. ఇవి స్వేచ్ఛారాధన, వినయము, మరియు దేహశిక్ష విషయంలో మంచివేగాని, శరీరేచ్ఛలను నిగ్రహించడానికి ఉపయోగపడవు, క్రీస్తుతో చనిపోయిన వారు, లోకమూలపాఠాల విషయం కూడా చనిపోయారు గనుక తిరిగి వాటిని అనుసరించవద్దు.

## II. ఆచరణాత్మక భాగం - 3 - 4 అధ్యాయాలు :

కొలస్సీ పత్రిక మొదటి రెండు అధ్యాయాలలో మనం ఆది నుండి ఉన్న క్రీస్తును గూర్చి అనగా త్రిత్వంలో ఒకనిగా, సృష్టికర్తగా, విమోచకునిగా, సంఘమునకు శిరస్సుగా ఉన్న విధానాన్ని చూసాం. సంఘములో ఉన్న క్రీస్తు మన వ్యక్తిగత జీవితాలలో కూడ ప్రాముఖ్యమైన వానిగా ఉండాలని, పౌలు వ్రాస్తు, పౌలు అందుకు మనం ఆచరణలో పెట్టాల్సిన విషయాలను గూర్చి 3,4 అధ్యాయాలలో వివరించాడు.

ఆచరణాత్మకమైన ఈ భాగంలో పౌలు, క్రీస్తు దైవత్వం యొక్క పరిపూర్ణతయని, ఆ పరిపూర్ణతను ఆయన విశ్వాసులలో నింపాడని వర్ణించాడు. ఆయన మనలో తన్ను తాను ఇముడ్చుకోగల మార్గము ఇదొక్కటే. విశ్వాసుల తలంపులు, జీవితం మరియు సహవాసం ఎలా ఉండాలి?

ఎ) **విశ్వాసుల తలంపులు మరియు ఆశలు పరలోకసంబంధమైనవి (3:1-4) :** మీరు క్రీస్తుతో లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకాలని వ్రాయబడింది. వెదకుట అన్న పదము అత్యవసరతను (urgency), ఆశను, కోరికను వ్యక్తం చేస్తున్నది. పైనున్నవి అంటే క్రీస్తుకు సంబంధించిన విషయాలు. పైన క్రీస్తు దేవుని కుడి పార్శ్వములో ఉన్నాడు. ఆ క్రీస్తును గూర్చిన విషయాలను

దేవుని వాక్యంలో వెదకినపుడే నూతన జీవితాన్ని అనుభవించగలుగుతావు. భూసంబంధమైన చిన్న చిన్న సమస్యలు, కోరికలు వాస్తవమైనవే అవసరమైనవే అయినా, ప్రస్తుత విషయాలపై గాక భవిష్యత్తులో జరుగబోయే విషయాలపై మన దృష్టిని మనస్సును ఉంచాలి (కొలస్సీ 3:4).

**బి) విశ్వాసుల జీవిత విధానం పరిశుద్ధమైనది (3:5-4:6) :** మనం నిజంగా క్రీస్తుతో లేపబడితే మన జీవితంలో వ్యక్తిగత పరిశుద్ధత మరియు ఇతరులతో గల సంబంధంలో పరిశుద్ధత తప్పకుండ కనిపిస్తాయి. క్రీస్తుతో లేపబడిన విశ్వాసులు, క్రీస్తుతో పరలోక జీవితాన్ని అనుభవించాలంటే ఈ భూమ్మీద జీవితం అందుకు తగినట్లుండాలి. కనుక భూమి మీదనున్న అవయవాలలోని పాపమును చంపివేయాలి (3:5). సమర్పించుకొన్నామని చెప్పే వారిలో సహితం ఈ పాపాలున్నాయి. పౌలు వాటిని బహిరంగముగా ఖండిస్తున్నాడు. వాటిని చంపివేస్తే అన్ని విషయాలలో మార్పువస్తుంది.

ఇక విశ్వాసి విసర్జించాల్సిన విషయాలకొస్తే (3:8) ఇవన్నీ ప్రాచీన స్వభావానికి సంబంధించినవి. ఇవి క్రీస్తును ఘనపర్చవు. విశ్వాసికి ఆత్మీయ పరిపూర్ణత చేకూర్చవు. కనుక ప్రాచీన స్వభావాన్ని పరిత్యజించి మనల్ని నూతన సృష్టిగా చేసిన ప్రభువు పోలిక చొప్పున నవీన స్వభావాన్ని ధరించుకోవాలి (3:10). పరిశుద్ధాత్మ సహాయంతో నూతన పురుషునిలో జీవించాలి.

అలా మార్చబడిన వారిలో కులమత, స్థితిగత విభేధాలు లేవు. క్రీస్తే సర్వము. ఆయన అందరిలో ఉన్నాడు (కొలస్సీ 3:11). ఇది వర్ణణాతీత కార్యం. క్రీస్తు వేర్వేరు వ్యక్తులను, గుంపులను ఐక్యపరచి ఒకే నూతన పురుషునిగా చేసే ఉత్ప్రేరకం (catalyst) గా ఉన్నాడు. రసాయనశాస్త్రం ప్రకారం ఉత్ప్రేరకం రెండు భిన్న పదార్థాలను కలిపి క్రొత్త పదార్థంగా మారుస్తుంది. యేసు ప్రభువు అక్షరాల అలాంటి కార్యమే చేసాడు. మనమందరం ఆయనలో ఒక్కటైయున్నాం.

విశ్వాసులు, తమ విశ్వాసమునకు తగిన మనస్సును ధరించుకోవాలి (ఫిలిప్పీ 3:12-17). ఇతరులతో సంబంధం కలిగి ఉండుటను గూర్చి ఈ భాగంలో వివరించబడిన విషయాలన్ని ఆత్మఫలానికి సంబంధించినవి. వీటిని మనం స్వయంగా అలవర్చుకోలేము. ఆత్మద్వారానే పొందగలం అనగా మనం ఆత్మస్వాధీనంలోనికి రావాలి.

విశ్వాసుల హృదయాలలో క్రీస్తు అనుగ్రహించు సమాధానము ఏలుచుండనివ్వాలి, దేవుని గూర్చిన గానం వుండాలి, క్రీస్తు వాక్యం సమృద్ధిగా ఉండాలి. మన సంగీతం, కీర్తనలు మరియు పద్యాలు ఇతరులకు బోధకలిగించేవిగా, బుద్ధిచెప్పేవిగా ఉండాలి. ఏమి చేసినా యేసు క్రీస్తు పేరట చేయాలి. ఇది వ్యక్తిగత, కుటుంబ, సంఘ, సామాజిక జీవితానికి కూడ వర్తిస్తుంది.

**కుటుంబ సంబంధాలు (3:18-21) :** ఈ భాగంలో ఎఫెసీ పత్రికలో చెప్పబడిన విషయాలే చెప్పబడినవి గాని దానికి ముందు ఇచ్చిన హెచ్చరికలలో మాత్రం తేడా వుంది. ఎఫెసీ 5:18లో **"ఆత్మపూర్ణులై యుండుడి"** అన్నాడు. కొలస్సీ 3:16 లో **"క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి"** అన్నాడు. కుటుంబ జీవితానికి ఈ రెండు సూత్రాలు అవసరం. ముఖ్యంగా కుటుంబంలో ఇవ్వబడిన పాత్రను, ఆధిక్యతను దుర్వినియోగం చేయవద్దని హెచ్చరించబడింది. (కొలస్సీ 3:19, 21).

**ఉద్యోగం (పని)లో సంబంధాలు (3:22-4:1) :** దాసులుగా ఉన్నవారు, క్రీస్తును అంగీకరించిన తరువాత క్రీస్తుకు దాసులైనప్పటికినీ, పని రీత్యా భూసంబంధమైన యజమానులకు లోబడాలి. వారు దేవుని కొరకు సమర్పించుకొన్నవారు గనుక సోమరులుగా ఉండక, శుద్ధాంతః కరణగలవారై త్రికరణశుద్ధితో పని చెయ్యాలి. మనుష్యులను సంతోషపెట్టడానికి వారికి కనిపించే విధంగా కాక ప్రభువుకు భయపడి, ప్రభువు నిమిత్తమని ఎంచి మనస్ఫూర్తిగా చెయ్యాలి.

ఇక యజమానుల విషయానికొస్తే వారు భూసంబంధంగా యాజమానులే అయినా ఆత్మీయంగా క్రీస్తులో అందరు సమానం గనుక తమ దాసులను సహోదరులుగా భావించాలి. పరలోకంలో వారికి కూడ ఒక యజమాని ఉన్నాడని గమనించి దాసులకు న్యాయం చేకూర్చాలి. వారికివ్వబడిన అధికారాన్ని దుర్వినియోగం చెయ్యవద్దు.

**మరికొన్ని ఆచరణాత్మక విషయాలు (4:2-6) :** ప్రార్థనయందు నిలుకడగా ఉండాలి, మెలకువగా ఉండాలి (4:2) : ఏ విషయమైతే ప్రార్థిస్తున్నామో దాని కొరకు పని చెయ్యడమే మెలకువగా ఉండుట, (నెహెమ్యా 4:9) ప్రార్థించామని నిద్రపోవద్దు. ఆ పనిలో నిమగ్నమైయుండాలి. అడిగిన దానిని పొందామని నమ్మి కృతజ్ఞత చెల్లించాలి.

**- సంఘమునకు వెలుపటి వారి యెడల జ్ఞానము కలిగి నడుచుకొనుడి :** అనగా లోకస్తుల మధ్య క్రియా పూర్వక సాక్ష్యం కలిగివుండాలి. ఎవరినేగాని బలవంతం చెయ్యకుండ దేవుడిచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకొని సువార్తనందించాలి. విశ్వాసి ప్రతి మనుష్యునికి ఎలా జవాబివ్వాలో ఎరిగివుండాలి. ఇతరులకు నష్టాన్ని కలిగించే మాటలను అదుపులో ఉంచుకోవాలి.

**సి) విశ్వాసుల సహవాసం పరమానందకరమైనది (4:7-18) :** ఈ భాగంలో పౌలు తనకు పరిచయమున్న వ్యక్తుల జాబితాను వ్రాస్తు వారిని గూర్చి క్లుప్తంగా వివరించాడు. వీరంతా మొదటి శతాబ్దానికి సంబంధించిన అన్యులేగాని దేవుని పిల్లలుగా మార్చబడ్డారు. వారిలో చాలమంది ఎఫెసులో నివసించారు.

1. తుకికు - ఎఫెసు సంఘకాపరి. (ఎఫెసీ 6:21; అపొ.కా. 20:4; **I** తిమోతి 4:12).
2. ఒనేసీము - ఇతడు కొలస్సీ పట్టణస్తుడే. ఫిలెమోను యొక్క సేవకుడు.
3. అరిస్తార్కు - పౌలుతోపాటు ఖైదులో ఉన్నవాడు.
4. మార్కు - బర్నబాకు సమీప జ్ఞాతి. (అపొ.కా.13:13; 15:37,38) **II** తిమోతి 4:11 చదవండి.
5. యూస్తు అను యేసు - ఇతడు సున్నతి పొందినవాడని వ్రాయబడింది గనుక బహుషా యూదుడై యుండవచ్చును. వీరందరు పౌలు జతపనివారు. వారి వలన పౌలు ఆదరణ పొందాడు.
6. ఎపఫ్రా-కొలస్సీ సంఘకాపరి, ఈ పత్రిక వ్రాసిన సమయంలో పౌలుతో కూడ చెరసాలలో ఉన్నాడు.
7. లూకా - వైద్యుడు.
8. దేమా - ఇతడు లూకాతో పాటు పౌలునొద్ద ఉన్నాడు.
9. నుంఫా - లవొదికయలోని ఒక విశ్వాసి - వీరి గృహంలో సంఘముగా కూడుకొనేవారు.
10. అర్ఖిప్పు - ఇతడెవరో వ్రాయబడలేదు, ప్రత్యేక పరిచర్యను చేయడానికి కృపావరాన్ని పొందినవాడు.

**ముగింపు : 4:16 "ఈ పత్రిక మీరు చదివించుకొనిన తరువాత లవొదికయ వారి సంఘములోను చదివించుడి, లవొదికయకు వ్రాసి పంపిన పత్రికను మీరును చదివించుకొనుడి".** పౌలు వ్రాసిన పత్రికలు ఒక సంఘాన్ని ఉద్దేశించి వ్రాయబడినా ఇతర సంఘాలకు కూడ పంపించబడ్డాయి. అలా పత్రికలను మార్చుకొని చదువుకొనడం వలన అనేక విషయాలు నేర్చుకొనే అవకాశం ఉన్నది. ముగింపులో పౌలు యథా ప్రకారంగా తన స్వహస్తాలతో వందనాలు వ్రాసాడు.

**TTB - Telugu - Study Outlines - Book of Philippians & Colossians**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**